# ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా






# ఆదేశాలు బేఖాతరు

- రెచ్చిపోతున్న ఇసుక, బుసక మాఫియా
- తోట్లవల్లూరులో యథేచ్ఛగా తవ్వకాలు

ప్రజాశక్తి–తోట్లవల్లూరు

తోట్లవల్లూరు మండలంలో ఇసుక, బుసక మాఫియా రెచ్చిపోతోంది. కలెక్టర్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను లెక్క చేయకుండా వందలాది లారీల్లో ఇసుక, బుసకను అక్రమంగా తరలించుకుపోతోంది. తాజాగా ఆదివారం దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక గ్రామంలో రహదారి పక్కన ఉన్న పొలంలోని మట్టి, బుసకను వందలాది లారీల్లో అక్రమంగా తరలించారు.

... కథనం 2వ పేజీలో



వార్త 4లో

కళ్లకు గంతలతో ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం 2

# ఆదేశాలు బేఖాతరు



- రెచ్చిపోతున్న ఇసుక, బుసక మాఫియా
- తోట్లవల్లూరులో యథేచ్ఛగా తవ్వకాలు

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు:** తోట్లవల్లూరు మండలంలో కృష్ణా నది పరివాహక ప్రాంతం 20 కిలోమీటర్ల అక్రమ సంపాదనకు ప్రధాన వనరుగా మారింది. రొయ్యూరు నుంచి ఐలూరు వరకు ఎనిమిది ఇసుక క్వారీ రీచ్‌లు ఉన్నాయి. అధికారులు ఎన్ని నిబంధనలు పెట్టినప్పటికీ అక్రమార్కులు ఏదో ఒక మార్గంలో ఇసుక, బుసక తరలించుకుపోతున్నారు. నిత్యం కరకట్ట వెంబడి ఏదో ఒక ఇసుకపాయ నుంచి ఇసుక, బుసక తరలింపు జరుగుతూనే ఉంది. దీనిని అరికట్టడంలో పోలీస్, రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతుందని, సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు. కనీసం కలెక్టర్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను సైతం లెక్క చేయడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆదివారం మండలంలోని దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక గ్రామంలో రహదారి పక్కన ఉన్న పొలంలోని మట్టి, బుసకను వందలాది లారీలలో అక్రమంగా తరలించారు. వోల్టా చట్టాన్ని సైతం లెక్కచేయకుండా పొలంలోని బోరు బావి చుట్టూ మూడు మీటర్ల లోతు మట్టిని తవ్వి తరలించారు. కళ్లంవారిపాలెంలోని ఇసుకను సైతం తరలించుకుపోతున్నారు. కృష్ణా నదికి వరద వస్తే ఈ తవ్వకాల వల్ల రహదారి మార్గం కొట్టుకుపోయి తమకు నడిచే మార్గం కూడా ఉండదని పొట్టిదిబ్బలంక గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గ్రామస్తులు విలేకరులకు ఇచ్చిన సమాచారం మేరకు తవ్వకాల ప్రదేశానికి వెళ్లి చూడగా అక్రమార్కులు భారీ యంత్రాలతో ఇసుక, బుసకను లారీలలో లోడ్ చేస్తున్నారు. ఐదు రోజుల నుంచి ప్రతి రోజు రాత్రిపూట ఈ తతంగం సాగుతుందని గ్రామస్తులు తెలిపారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినప్పటికీ వారు స్పందించడం లేదని తెలిపారు. ఆదివారం అధికారులు సెలవుల్లో ఉంటారని తెలిసి అక్రమార్కులు పట్టపగలే దోపిడీకి తెర తీశారు. స్థానిక వీఆర్వోకి ఫోన్లో సమాచారం ఇవ్వగా తాను ఆదివారం కావడంతో వేరే ఊరికి వెళ్లానని వీఆర్‌ఏని పంపిస్తున్నానని తెలిపారు. కొంతసేపటికి ఒక లారీని, ఎక్స్‌కవేటర్ మిషన్‌ను రెల్లి దుబ్బులో దాశారు. విలేకరులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో అక్రమార్కులు మళ్లీ తవ్వకాలు మొదలుపెట్టారు. ఈ నెల 1వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం కృష్ణానది పాయల నుంచి ఇసుక, బుసక తవ్వకాలు నిలుపుదల చేయాలని జిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు బేఖాతరు చేసి తవ్వకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంగా ఈ అక్రమ తవ్వకాలను నిరోధించాలన్నారు. మండల తాసిల్దార్ కుసుమకుమారి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం అన్ని గ్రామాలలో మైక్ ప్రచారం చేసి ఇసుక, బుసక అక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కానీ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి మండలంలోని అనేక గ్రామాలలో ఇసుక, బుసక మాఫియా రాజ్యమేలుతుంది.





## వైద్య విద్యార్థులు మార్పుల్ని గమనించాలి

**ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ :** వైద్య విద్యార్థులు నిరంతరం వైద్య రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలని నాగార్జున హాస్పిటల్ అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ శ్రీ లక్ష్మీ అన్నారు. ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఆయుష్ హాస్పిటల్ సంయుక్తంగా 'రాపిడ్ - 2025' పేరుతో నగరంలోని హోటల్ నోవాటెల్‌లో ఆదివారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానంలో రోగ నిర్ధారణ పరీక్షల్లో అల్ట్రా సౌండ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. అల్ట్రా సౌండ్ చేయు విధానంలో నైపుణ్యతను ఏవిధంగా పెంచుకోవాలో రోగ నిర్ధారణ చేయడంలో అల్ట్రా సౌండ్ ఏ విధంగా పని చేస్తుందో యువ వైద్య విద్యార్థులకు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సూర్యదేవర కేశవరావు బాబు మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్నవారు నూతన ఆధునిక వైద్య విధానాలను గురించి తెలుసుకోవాలన్నారు. ఇటువంటి సదస్సును ఏర్పాటు చేసినందుకు ఆయుష్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం అమెరికాలో స్థిరపడిన ప్రముఖ వైద్యులు డాక్టర్ హరి కె.కలగర ఈ సెమినార్‌లో ప్రధాన ఉపన్యాసకులుగా పాల్గొని నూతన వైద్య రంగంలో వస్తున్న మార్పుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పిఎస్ఎస్ చౌదరి, డాక్టర్ గోపాల కృష్ణ పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## జీవితంలో యోగా భాగం కావాలి

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడ బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆదివారం జరిగిన యోగాభ్యాసన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు యోగా సనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డా.రత్న ప్రియదర్శిని, యోగా ఔత్సాహికులు తదితరులు పాల్గొన్నారు. యోగా సాధనను ఏ ఒక్క రోజుకో, నెలకో పరిమితం చేసుకోకుండా నిత్య జీవితంలో భాగం చేసుకునేలా ప్రోత్సహించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యకర జీవన ప్రయాణంలో యోగాను తప్పనిసరిగా తోడుగా ఉంచుకోవాలని సూచించారు.

## ఫొటోగ్రాఫర్లకు పురస్కారాలు : కలెక్టర్

**ప్రజాశక్తి-విజయవాడ:** ఆగస్టు 19 ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫొటో జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు జులై 31వ తేదీలోగా తమ ఎంట్రీలు పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విభాగంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్‌టీఆర్, యోగాంధ్ర అంశాలకు సంబంధించి ఫొటో ఎంట్రీలు పంపాచ్చని, రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం-2 ఉన్నాయని, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ రూ.10 వేలు, ద్వితీయ రూ. 7 వేలు, తృతీయ రూ.4 వేలు బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక సెక్షన్ నుంచి మూడు ఫొటోలు, అదే విధంగా మొత్తం మూడు సెక్షన్ల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చని తెలిపారు. ఫొటోలు 2024 జూన్ 12 నుంచి 2025 జులై 31 మధ్య తీసినవై ఉండాలన్నారు. ఫొటోలు ఎన్‌టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని, వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదని పేర్కొన్నారు. ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని, ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డీఐఆర్వో కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ-520002 చిరునామాకు నేరుగా, పోస్టల్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9121215373 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

# కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

## నేడు భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా మహాసభ

**ప్రజాశక్తి-విజయవాడ**

ఎన్‌టిఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 10వ మహాసభ సోమవారం జరగనుంది. ఉదయం 9.30 గంటలకు రామవరప్పాడు రింగ్ రెయిన్‌బో హాస్పిటల్ ఫీడర్ రోడ్డులో ఉన్న ఎం కన్వెన్షన్ ప్రాంగణంలో జరిగే సభ సందర్భంగా రామవరప్పాడు వంతెన సెంటర్ నుంచి ఎం కన్వెన్షన్ హాల్ వరకు భవన నిర్మాణ కార్మికుల భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ, సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి అప్పారావు, పి నర్సింహారావు, శ్రామిక మహిళ జిల్లాకన్వీనర్ ఎ కమల పాల్గొని మాట్లాడతారు. ఇప్పటికే మహాసభ వేదిక ముస్తాబైంది. సభా ప్రాంగణంతో పాటు ర్యాలీ జరిగే ఏరియాలో సిఐటియు తోరణాలతో అలంకరించారు.

గడిచిన మూడేళ్ల కాలంలో జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాజీలేని పోరాటం చేసింది. గత జిల్లా మహాసభ 2023లో మైలవరంలో జరుపుకున్న యూనియన్ ఈ మూడేళ్ల కాలంలో కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించింది. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తెరిపించాలని, సెస్‌ను సక్రమంగా వసూలు చేయాలని, బిల్డింగ్ వర్కర్స్‌ను పనులు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని, ఇసుక సమస్యను పరిష్కరించాలని, ఆయా ప్రమాదాల్లో మృతి చెందినా, గాయపడిన సంబంధిత కుటుంబాలను ఆదుకోవాలని యూనియన్ కార్మికులను కలుపుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయం, డివిజన్, మండల స్థాయి రెవెన్యూ కార్యాలయాలతో పాటు విజయవాడ ధర్నా చౌక్‌లో పలు సార్లు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సంక్షేమ బోర్డును అమలు చేయాలని సిఎం దగ్గర నుంచి డిప్యూటీ సిఎం, మంత్రి లోకేష్, మంత్రులు, యంపిలు, ఎమ్మెల్యేలు స్థాయిలో రెండుసార్లు ఇప్పటికే యూనియన్ వినతిపత్రాలు అందజేసింది.

### సంక్షేమ బోర్డు నిర్వీర్యం

బిల్డింగ్ వర్కర్స్ దాచుకున్న వందల కోట్లాది రూపాయలను ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం, అలాగే గత వైసిపి ప్రభుత్వం దారి మళ్లించి, వేరే అవసరాలకు వినియోగించుకొని, కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. 30 ఏళ్ల పాటు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును ప్రభుత్వాలు కార్మికులకు ఉపయోగం



లేకుండా చేశాయి. ఎన్‌టిఆర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు నెలకు రూపాయి, ఏడాదికి రూ. 12 చొప్పున సుమారు రూ. 300 కోట్ల వరకు దాచుకున్న డబ్బును గడిచిన ఆరు సంవత్సరాల నుంచి కార్మికులకు ఉపయోగించడం లేదు. 1214 జీఓను గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చి సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేసింది. జిల్లాలో ఈ రెండేళ్ల కాలంలో పని ప్రదేశాల్లో 15 మంది వరకు ప్రమాదవశాత్తు మృతి చెందారు. అలాగే 30 మందికి పైగా తీవ్రంగా గాయపడి ఇళ్లకే పరిమితం అయ్యారు. అయినా సంక్షేమ బోర్డు నుంచి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వాలు మంజూరు చేయలేదు.

### పనులు లేక తీవ్ర ఇబ్బందులు

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన పూర్తి స్థాయిలో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. ఉన్నా కానీ అరకొర వేతనాలు. దీంతో కార్మికుల కుటుంబాలు అప్పులపై జీవించాల్సి వస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణ అంశం భవన నిర్మాణ కార్మికులపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. 26 రకాల వృత్తులు ఆధారంగా సాగే కార్మికుల పనులు, రాజధాని నిర్మాణ పనులు లేకపోవడంతో ఆ ప్రభావం విజయవాడ నగరంపై కూడా పడింది. విజయవాడ సిటీలోనే 70 వేల మంది కార్మికులు, జిల్లా వ్యాప్తంగా లక్షన్నర వరకు కార్మికులు ఉన్నారు. అయితే కార్మికశాఖ వీరందరికీ పనులు కల్పించడం, సంక్షేమ బోర్డు ద్వారా సదుపాయాలు కల్పించాల్సి ఉండగా, ఆ శాఖ కూడా అలంకార ప్రాయంగా తయారయిందనే విమర్శ వినిపిస్తుంది. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల ప్రభావంతో కార్మికుల పని గంటలు, కూలి, సంక్షేమ పథకాలు, పని భద్రత, కార్మికుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని కార్మిక సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో జరుగుతున్న 10వ మహాసభలో సంక్షేమ బోర్డును తెరిపించి, వారి సంక్షేమానికి ఉపయోగించాలని ఈ మహాసభలో చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించనున్నారు.

## నేడు అర్జీలు స్వీకరణ

**ప్రజాశక్తి-విజయవాడ**


ఈ నెల 30వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అలాగే విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వీఎంసి కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.





# పెదమద్దాలి రోడ్డు గుంతలమయం

**ప్రజాశక్తి - పామర్రు :** మండల పరిధి పెదమద్దాలి గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా అస్తవ్యస్తం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పామర్రు-గుడివాడ జాతీయ రహదారి నుండి పెదమద్దాలి గ్రామం వెళ్లేందుకు నాలుగు కిలోమీటర్ల మేర జిల్లా పరిషత్ తారు రోడ్డు ఉంది. అక్కడ నుండి ఎలమర్రు గ్రామానికి కూడా రహదారి ఉంది. రెండు సంవత్సరాల క్రితం ఎలమర్రు గ్రామంలో నూతనంగా 420 కేవి సబ్ స్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది . ఈ 420 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా నిత్యం హెవీలోడు వాహనాలు, లారీలు వెళుతూ ఉన్నాయి.ఈ కారణం చేత రోడ్డు పూర్తిగా పాడైపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సబ్ స్టేషన్ నిర్వాహకులు ఈ రోడ్ మరమ్మతులను ఏ మాత్రం పట్టించుకోకుండా వదిలేసి వారి పని వారుచూసుకుంటున్నారు .పెదమద్దాలి గ్రామపంచాయతీ గాని రహదారుల శాఖ ఇతర ప్రభుత్వఅధికారులు గాని ఈ రహదారిపై పర్యవేక్షణ లేకుండా పోయింది. ఉన్న రోడ్డు మొత్తం గుంతల మయం కావడంతో వర్షం వచ్చినప్పుడు నీటితో నిండి దారి కనిపించక సైకిల్ ద్విచక్ర వాహనదారులు కింద పడిపోయి సంఘటనలు అనేకం ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ రోడ్డులో అధిక లోడుతో వెళుతున్న టిప్పర్లు, లారీలను అదుపు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాబోతున్న ఈ తరుణంలో కూలీలను ఎరువులను తరలించేందుకు ఆటోలు ట్రాక్టర్లు సైతం రావడానికి ఈ రహదారి తీవ్ర ఇబ్బందిగా మారింది అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నేతలు

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి మండలం పాత మాజేరులో ఇటీవల మతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రాజుల పార్టీ సోమయ్య కుటుంబ సభ్యులను టిడిపి నాయకులు ఎన్నారై బొబ్బా గోవర్ధన్ నియోజకవర్గ పరిశీలకులు కనక పర్తి శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం టిడిపి నేతలతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టాల్లో ఉన్న పేద కుటుంబం ఆదుకునేందుకు 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని భార్య సీతారావమ్మా, కుమార్తె ఆదిలక్ష్మి లకు అందజేశారు. ప్రమాదంలో కాలు కోల్పోయిన అదే గ్రామానికి చెందిన ప్రభాకరరావును పరామర్శించి బ్యాటరీతో నడిచే వీల్ చైర్ను అందచేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఎంపీపీ కోట విజయ రాధిక, మాజీ ఎంపీపీ తిరుమల శెట్టి రామారావు, రావెళ్ల విజయకుమార్ రావేల ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారంఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమం జరుగుతుందని వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 172వ ఉచిత వైద్య నేత్ర శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు మీ మోహన్ రావు కంటి పరీక్షలు నిర్వహించి 33 మందిని ఐఓఎల్ ఆపరేషన్కు గుర్తించారు. వారికి విజయవాడలోని అమరావతి కంటి వైద్య వైద్యశాలలో బుధ,గురువాదంలో ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. క్లబ్ ప్రతినిధులు వరదా హరి గోపాల్, వరద రాజశేఖర్,దేసు జయలక్ష్మి, తమ్మన వేణుగోపాల్ రావు తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

## కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అత్యధిక సంఖ్యలో యాత్రికులు దర్శనం చేసుకున్నారు. సుమారు15వేలమంది పైగా భక్తులు దర్శించుకొనగా అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానమునకు విచ్చేసిన యాత్రికులకు ఉచితంగా మజ్జిగ, ప్రసాదం, తాగునీరు, అందజేశారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**ప్రజాశక్తి- నందివాడ:** జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, గుడివాడ ఎస్డిపిఓ వి.ధీరజ్ వినీల్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు నందివాడ ఎస్సై కె.శ్రీనివాసు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షింది లేదని ఎస్ఐ తెలిపారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీస్ శాఖ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు.**ప్రజాశక్తి - గుడివాడ :** రౌడీషీటర్లు అల్లర్లకు దూరంగా ఉండి మంచిగా జీవిస్తే రౌడీషీట్లను ఉన్నతధికారులతో మాట్లాడి ఎత్తి వేసే విధంగా చర్యలు తీసుకుంటామని 1టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబులు అన్నారు. ఆదివారం స్థానిక 1టౌన్ పోలీసు స్టేషన్, తాలుకా పోలీసు స్టేషన్‌లలో గుడివాడ పరిధిలోని రౌడీషీటర్లుకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సందర్భాలలో రౌడీషీటర్లు ఎంతో మందికి సేవ చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. రౌడీషీటర్లు గొడవలకు, కొట్లాటలకు దూరంగా ఉండాలన్నారు.



నందివాడ మండలంలో...



గుడివాడ మండలంలో...

## 5న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి ఉయ్యూరు :** రాజీమార్గమే రాచమార్గమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, సివిల్ జడ్జి కంటిపూడి శ్రీహరి తెలిపారు. ఈనెల జూలై 5 శనివారం జాతీయ లోక్ అదా లత్‌ను ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో రాజి పడదగిన క్రిమినల్ సివిల్ ప్రో నోటు కేసులు ఇతర కేసులు కక్షిదారులు న్యాయవాదులు సంబంధిత ఏ కేసులైన రాజీమార్గం ద్వారా సరిచేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి శ్రీహరి కోరారు.

## నీటి నిల్వ ట్యాంకుల ఏర్పాటు

**ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి అంగన్వాడి సెంటర్లో నీటి నిల్వ ట్యాంకులను మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీ రాణి పర్యవేక్షణలో ఆదివారం ఏర్పాటు చేశారు. 2025 గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ పథకంలో భాగంగా అంగన్వాడీ ప్రాంగణంలో విద్యుత్ మోటార్, ట్యూబ్ లైట్లు గ్రామపంచాయతీ సిబ్బంది వినియోగంలోకి తీసుకొచ్చారు. మోపిదేవి పంచాయతీ కార్యదర్శి ఎం మల్లేశ్వరరావు, అంగన్వాడి వర్కర్స్, చిన్నారులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అంకితభావంతో మస్తాన్‌ఖాన్ విధుల నిర్వహణ

**ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** పోలీస్ యూనిఫారం ధరించిన నాటి నుంచి నేటి వరకు వృత్తి పట్ల అత్యంత గౌరవంతో,అంకితభావంతో పనిచేసి డిపార్ట్మెంట్ మన్ననలు అందుకున్న మస్తాన్ ఖాన్ సోమవారం మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా పదవి విరమణ చేస్తున్నారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా మాట్లాడుతూ 1983లో పోలీస్ డిపార్ట్మెంట్లో కానిస్టేబుల్ గా కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన నాటి నుంచి వత్తి ధర్మాన్ని పాటిస్తూ ఉన్నతాధికారుల సూచనలు తప్పక పాటిస్తూ విధులు నిర్వహించేవాడినని తెలిపారు. శాఖా పరంగా పదోన్నతులు అందుకుంటూ వివిధ స్థాయిల్లో పనిచేసిన ప్రతిచోటా అటు ప్రజల నుంచి ఇటు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నానన్నారు. 2019లో పోలీస్ సేవ పథకం 2020లో కేంద్రం అందించిన ఉత్కృష్ట సేవా పథకం తన సర్వీసులో వచ్చిన రివార్డులుగా పేర్కొన్నారు. పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించడం కూడా మంచి అనుభూతులు ఇచ్చిందన్నారు. ఏడున్నర సంవత్సరాలు బందరుల ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. గత మూడు ఏళ్ల కాలంగా మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తుండగా ఈ కాలంలో ఎంతోమంది భార్యాభర్తలు గొడవలు పడి పోలీస్ స్టేషన్ మెట్ల ఎక్కిన వాళ్లను సామరస్యంగా కౌన్సిలింగ్ ఇచ్చి సంతోషంగా పంపిన ఘటనలు అనేకమన్నారు.

# పెట్రోలింగ్ వాహనాలతో మెరుగైన సేవలు : డిఎస్‌పి

**ప్రజాశక్తి-గన్నవరం :** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు గన్నవరం సబ్ డివిజన్ డిఎస్పి చలసాని శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం ట్రాఫిక్ లిమిట్స్ లో ట్రాఫిక్ నియంత్రణ కొరకు కేటాయించిన నాలుగు మోటార్ వాహనాలను గన్నవరం ఎస్‌డిపిఓ చేతుల మీదుగా వాహనాలను ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డీస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మోటార్ వెహికల్స్ ఉప యోగించి గన్నవరం ట్రాఫిక్ లిమిట్స్ లో మెరుగైన ఎన్ఫోర్స్మెంట్ వర్క్ చేయవచ్చునని, వీటి వల్ల రోడ్డుపై అనుకోని ప్రమాదం జరిగినప్పుడు బాధితుడికి అవసరం అయ్యే ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉంటుందన్నారు. రోడ్డుపై లేదా రోడ్డుమీద అడ్డుగా ఉన్న షాపులకు, వాహనదారులకు సూచనలు ఇవ్వడానికి పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం (మైక్) కూడా ఉందని, రోడ్డు పై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పోలీస్ సైరన్ సహాయంతో ప్రమాదం జరిగిన ప్రదేశానికి త్వరగా వెళ్ళవచ్చున్నారు. రోడ్డుపై గస్తీ తిరుగుతూ ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడానికి వెహికల్స్ ఉపయోగపడతాయని, రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయినప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేయడానికి లేదా అడ్డుగా ఉన్న వాహనాలు తొలగించడానికి వెహికల్స్ ఉపయోగకరంగా ఉంటుందని, వెహికల్స్ పై ట్రాఫిక్ పోలీస్ కనిపించేలా ఉండటం వలన ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే వారు జాగ్రత్త పడతారన్నారు. ఈ విధంగా మోటార్ వెహికల్స్ సహాయంతో గన్నవరం ట్రాఫిక్ లిమిట్స్ లో మెరుగైన ట్రాఫిక్ సేవలు అందిస్తామని తెలియపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ సిఐ బివి శివప్రసాద్, ట్రాఫిక్ సిఐ పెద్దిరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.




వాహనాలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి

## దుర్గమ్మకు బంగారు బోనం

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారిని ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ వారి ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించే ఊరేగింపు కార్యక్రమంలో మంత్రిపాల్గొన్నారు.దుర్గమ్మ వారికి హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల సభ్యులు బంగారు బోనం సమర్పించారు. 500 మంది కళాకారులు విచిత్ర వేషాలు, పోతురాజులు డప్పులు, కోలాటాలతో బ్రాహ్మణ విధి నుంచి ఘాట్ రోడ్డు మీద దుర్గమ్మ చెంతకు బంగారు బోనం చేరుకుంది. దేవస్థానం నుంచి ఆంధ్రప్రదేశ్ కళారూపాలైన చిన్నారుల నెమలి నృత్యం, కరగ నృత్యం, తప్పెట్లు, కోలాటం, సంప్రదాయ భజనలు ఏర్పాటు చేశారు. దుర్గగుడికి చేరుకున్న బంగారు బోనాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందుకున్నారు. మంత్రి బోనం సమర్పించడానికి తెలంగాణ నుంచి వచ్చిన కమిటీ సభ్యులకు, భక్తులకు ఏటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వి. కె.శీనా నాయక్ స్పష్టం చేశారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**ప్రజాశక్తి, విజయవాడ:** 'దృశ్య వేదిక" ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీ నగర్ వి.హెచ్ .గ్రంథాల యంలో జరిగిన జూన్ మాస సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్ని అలరిం చాయి. చదలవాడ ఆనంద్ దర్శకత్వంలో జయశ్రీ కూచిపూడి కళా నత్య నిలయానికి చెందిన సీహెచ్. నాదకార్తిక, జి.అమతవర్షిణి, జి.జయసాత్విక, వై.సాత్విక, సీహెచ్ పవనప్రత్యూష, వై.ఆశ్రిత, పి.స్నిగ్ధ, ఎం.రశ్మిక, వై.పావనిమీనాక్షి, ఎస్.భవ్యశ్రీలు వినాయక కౌత్వం, ఆనంద తాండవం, రామాయణ శబ్దం, దశావతార శబ్దం, వచ్చెను అలివేలుమంగా వంటి సాంప్రదాయ నృత్యాల్ని రక్తిగట్టించారు. కార్యక్రమంలో రెండో భాగంగా "స్వర్ణ సూర్య డ్రామా లవర్స్", హైదరాబాద్ వారు రచయిత ఉదయ్ భాగవతుల స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించిన "సాహితీ సూక్తం" అనే సాంఘిక నాటిక సాహిత్యం - సమాజం మధ్య ఉన్న సంబంధాన్ని ఆవిష్కరిస్తుంది. ఆత్మహత్యలు, మోసాలు, నేరాలు వంటి సమకాలీన సమస్యల్ని సానుభూతితో, లోతైన ఆలోచనలతో వివరించడానికి ప్రయత్నించిన ఈ నాటికలో సీహెచ్ కార్తిక, సునయన, ద్వాదశి వెంకటచంద్రశేఖర్, ఉదయ్ భాగవతుల పాత్రోచితంగా నటించారు. థామస్ , వెంకటేశ్వరరావు (మేకప్), రమణ (బ్యాక్‌గ్రౌండ్ స్కోర్), సురభి ఉమాశంకర్ (లైటింగ్) నేపథ్యంలో సహకరించారు. 'వేదిక' ప్రధాన బాధ్యుడు హెచ్వీఆరెస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులను సత్కరించారు. నరేన్, కత్తి శ్యామ్ ప్రసాద్, రమేష్, పద్మశ్రీ నిర్వహించారు.

## చెత్త తొలగింపు

### ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి - తిరువూరు :** ఈనెల 26న ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన డంపింగ్ యార్డుగా కోకిలంపాడు కట్టలేరు బ్రిడ్జి కథనానికి తహశీల్దార్ ఎం.ఉదయ్ భాస్కర్ స్పందించారు. నగర పంచాయతీ కమిషనర్ మనోజతో కలిసి బ్రిడ్జి కింద ఖానాలను పూడ్చుతూ డంపింగ్ యార్డును మరిపించేలా ఖాళీ కొబ్బరి బొండాలను జేసిబితో తొలగింపు పనులు చేపట్టారు. ట్రాక్టర్లతో వేరే ప్రాంతానికి డంప్ చేయించారు. ఖాళీ బొండాల డంపింగ్‌తో ఉన్న బ్రిడ్జిని ప్రమాదం నుండి తప్పించిన తహశీల్దార్‌ను రైతులు అభిందించి హర్షం వ్యక్తం చేశారు.

## స్విమ్మింగ్ పోటీల్లో నందిగామ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి- నందిగామ :** ఈనెల 28 .29 వ తేదీన హైదరాబాద్ నగరంలో 25 మీటర్ల స్విమ్మింగ్ పోటీలు హైదరాబాద్ యూత్ స్విమ్మింగ్ చాంపియన్ 2025 వారు హైదరాబాద్ లో పుల్లల గోపీచంద్ అకాడమీ గచ్చిబౌలి నందు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. స్విమ్మింగ్ పోటీలకు నందిగామ కాకతీయ స్విమ్మింగ్ అకాడమీ నుండి మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పార్టిసిపేట్ చేసి బహుమతులు గెలుచుకున్నారు. హైదరాబాద్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ , బహుమతులు గెలిచిన విద్యార్థులను కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ , భారతి , డైరెక్టర్స్ కాపా కార్తికేయ, స్ఫూర్తి ,సుష్మ , ప్రిన్సిపల్ సత్యమూర్తి , మేనేజర్ కోటేశ్వరరావు, కాకతీయ స్విమ్మింగ్ అకాడమీ కోచ్ గోపీచంద్ ఉపాధ్యాయుల బృందం పోటీలు బహుమతులు గెలుచుకొన్నారు

# కళ్లకు గంతలతో ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



ఐదో రోజు సమ్మెలో పాల్గొన్న కాశీనాథ్, కార్మికులు, నాయకులు

**ప్రజాశక్తి - విజయవాడ :** యోగాంధ్ర కాస్త... రోగాంధ్రగా మారకముందే ఎటువంటి భేషజాలకు పోకుండా సామరస్య పూర్వక వాతావరణంలో యూనియన్ నేతలతో ప్రభుత్వం చర్చలు జరిపి, ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ (వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, కంప్యూటర్ ఆపరేటర్స్) కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరింది. యూనియన్ నేతలు, కార్యకర్తలు, కార్మికులు నల్లరిబ్బన్‌తో కళ్ళకు గంతలు కట్టుకొని నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతం అయింది. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికులు అడుగుతున్న న్యాయమైన డిమాండ్స్ మొత్తం పరిష్కారమైతేనే సమ్మెను విరమించేదని అన్నారు. వందలాది మంది కార్మికులు గత ఐదు రోజుల నుంచి మొక్కవోని దీక్షతో సమ్మె చేస్తున్నారని, అయినా ప్రభుత్వంలో ఉలుకూ-పలుకూ లేకుండా పోయిందన్నారు. కార్మికుల సహనాన్ని పరీక్షించకుండా వారి సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాని పక్షంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా, వేలాది మంది శానిటేషన్ వర్కర్లు కూడా వీధుల్లోకి వచ్చి సంఘీభావంగా సమ్మె చేయడం జరుగుతుందన్నారు. దీంతో శానిటేషన్ అధ్వాన్నంగా తయారయి యోగాంధ్ర పోయి రోగాంధ్రగా తయారవుతుందని విమర్శించారు. ఈ సమ్మెకు మద్దతుగా డ్రైనేజీ సెక్షన్ నుండి జయరావు రావు మద్దతు తెలిపి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి ప్రవీణ్ ,నగర కోశాధికారి డి స్టీఫెన్ బాబు, వాటర్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు, నల్ల శ్రీను, నారాయణ, పార్క్ సెక్షన్ బాధ్యులు టీ చిన్న వెంకట్రావు, వెహికల్ డిపో మెకానికులు దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గగుడి పరిసరాల్లోని హాకర్ల జీవనోపాధి కాపాడాలి

### సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు



బాధిత హాకర్స్‌ను పరామర్శించి వారితో మాట్లాడుతున్న సత్యబాబు

**ప్రజా శక్తి - విజయవాడ సిటీ :** గత 30 ఏళ్ల నుంచి దుర్గగుడి పరిసరాల్లో వీధి విక్రయ దారులుగా జీవన ఉపాధి పొందుతూ యాత్రికులకు సరసమైన ధరలకు అందుబాటులో పూజా సామాగ్రి, ఫ్యాన్సీ, ఆట వస్తువులను విక్రయిస్తున్న వీధి విక్రయదారులను అన్యాయంగా బుల్డోజర్లతో వారి షాపులను ధ్వంసం చేయడం పోలీసు నిర్బంధంతో అణిచివేయడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తొలి అడుగు ఇదేనాని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్య బాబు ఈ ప్రభుత్వాన్ని నిలదీశారు. విజయవాడ దుర్గ గుడి సమీపంలోని అర్జున వీధిలో వీధి విక్రయదారుల దుకాణాలను శనివారం నాడు నిర్బంధంగా తొలగించిన క్రమంలో బాధిత వ్యాపారులను సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పార్టీ నేతలతో కలిసి ఆదివారం పరామర్శించారు. సిఐటియు పశ్చిమ కార్యదర్శి ఈ నారాయణ, ఉపాధ్యక్షులు వి సాములు, మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి జ్యోతి బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

# స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సత్యబాబు, తదితరులు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** టిడిపి కూటమి ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్యబాబు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో బి.సత్యబాబు, డివిజన్ నాయకులు 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వినతిపత్రాలను పంపిణీ చేశారు. వినియోగించిన విద్యుత్ కంటే అధికంగా వస్తున్న నెలవారి కరెంటు బిల్లులతో ఇబ్బందులు పడుతున్నామని డివిజన్ ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు సత్యబాబు వెల్లడించారు. సిపిఎం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు జులై 4న తలపెట్టిన పోరుబాటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఐదో నెంబర్ రూట్ ప్రభుత్వ ఐటిఐ కాలేజీ సమీపంలోని ఎపిసిపిడిసిఎల్ రాష్ట్ర కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజు, సిహెచ్.రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



63వ డివవిజన్‌లో నిరసన తెలుపుతున్న స్థానికులు

**విజయవాడ :** విజయవాడ నగరంలో ఇళ్లకు షాపులకు ఇప్పటికే పెట్టిన స్మార్ట్ మీటర్లు తొలగించి పాత మీటర్లను బిగించాలి ఏ ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టవద్దని 63 డివిజన్ సుందరయ్య నగర్ విశాలాంధ్ర కాలనీ వాసులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బిరమణారావు మాట్లాడారు.

# ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

### మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపు



మాట్లాడుతున్న కె.ఎస్.లక్ష్మణరావు

**ప్రజాశక్తి - విజయవాడ :** ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన కర్తవ్యం ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, ప్రభుత్వం యంత్రాంగంపై ఉందని మాజీ ఎమ్మెల్యే కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడ యుటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మణరావు మాట్లాడుతూ...ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యప్రయివేటీకరణ వలన ప్రభుత్వ విద్యారంగం దెబ్బతింటుందని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రజలకు నమ్మకం కలిగించే రీతిలో పనిచేసి, ఎన్రోల్మెంట్ పెంచడంలో కృషి చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యస్‌పి మనోహర్ కుమార్ మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ కాన్సెప్ట్‌ను వినియోగించుకుని ఉపాధ్యాయ, సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రాథమిక పాఠశాలల రోల్ పెంచాలని కోరారు. ఫెడరేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల హక్కుల సాధన కోసం జూలై 9న జరిగే అఖిల భారత సమ్మెలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, పి.లీల, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శిలు డి.హరి ప్రసాద్, కె.గంగ రాజు, బి.రెడ్ స్టార్, బి.రమణయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వి.కొండలరావు యల్.చంటి, తదితకెలె పాల్గొన్నారు.

## వైస్ హాస్పిటల్ ప్రారంభం

**విజయవాడ :** విజయవాడ నగరంలోని కానూరు, పంటకాలువ రోడ్డులో వైస్ హాస్పిటల్ ప్రారంభించారు. వైస్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ రమ్య, గైనకాలజిస్ట్, డైరెక్టర్ డాక్టర్ వెంకట పవనేశ్వర్, డియన్బి (సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాజలి)-ఎఐజి హాస్పిటల్, పద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్ ఛైర్ పర్సన్ డాక్టర్ సుధ చదలవాడ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎంఎల్ఎలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్‌రావు, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి - ఎ.కొండూరు :** ఏ కొండూరు మండలంలోని రేపూడి గ్రామ సమీపాన ఒక రైతుకు చెందిన మామిడి తోటలో కుళ్ళిపోయి గుర్తుపట్టడానికి వీలు లేని స్థితిలో ఒక మతదేహం లభ్యం అయింది. ఏ కొండూరు ఎస్సై టి.కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రేపూడి గ్రామ సమీపాన ఒక మామిడి తోటలో కుళ్ళిపోయిన మృతదేహం వాసన వస్తుండటంతో స్థానికులు గుర్తించి ఆ విషయాన్ని తమకు తెలియజేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని రెడ్డిగూడెం మండలం పాత మద్దుల పర్వ గ్రామానికి చెందిన కోట రాము (46)గా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోటా రాము గత మూడు రోజులగా కనిపించడం లేదని రాము కోసం తాము వెతుకుతున్నట్లు చెప్పినట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహానికి శివపంచినామ నిర్వహించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై కృష్ణ తెలిపారు.

## నిత్యావసరాలు పంపిణీ

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామం పేరాబత్తుల దళిత వాడలో కేశినేని శ్రీదేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా వృద్ధులకు, వికలాంగులకు, పేదవాళ్లకు నిత్యావసర సరుకులు, బియ్యం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు కేశినేని రమేష్ మాట్లాడుతూ మా ట్రస్టు ద్వారా పేదవారికి, నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు ప్రతినెల కొన్ని కుటుంబాలకు అందించే దిశగా తాము అడుగులు వేస్తున్నామని రెండు రాష్ట్రాల్లో మా ట్రస్ట్ ద్వారా సహాయం చేసేందుకు కృషి చేస్తామని మున్ముందు పేదవారికి గృహ నిర్మాణం, కృత్రిమ అవయవాలు చదువుకునే వారికి ఉన్నత చదువులకు సహాయం అందించే దిశగా మా ట్రస్ట్ స్థాపించినట్లు తెలిపారు.

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ పనులు

- ఎన్టీఆర్ బొమ్మ వైపు కొత్త డ్రైనేజీ లేనట్లే
- మళ్లీ ఆక్రమణలు షురూ

**ప్రజాశక్తి-గన్నవరం** : గన్నవరం - ఆగిరిపల్లి ఆర్అండ్ బి రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. గాంధీ బొమ్మ సెంటర్ వైపు, కొత్త డ్రైనేజీ పలు వంకరలు తిప్పేస్తున్నారు. మురుగు నీరు పోతుందా అన్న అనుమానం కలుగుతోంది. కొన్నిచోట్ల మార్కింగ్ చేసిన స్థలం కూడా ఖాళీ చేయించలేదు. సుమారు రెండు నెలలు క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటికి ఓ కొలిక్కి రాలేదు. దీంతో అస్తవ్యస్తంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, రోడ్డు పక్కన గోతులు తవ్వి వదిలివేయడంతో దుకాణదారులు ఇబ్బం దులు పడుతున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావు ఆదేశాల మేరకు ఏప్రియల్ లో ఆర్అండ్ బి రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరు వైపులా సర్వే నిర్వహించి మార్కింగ్ చేసిన వరకు ఆక్రమణలను తొలగించారు. విస్తరణ పనుల కోసం ఏళ్ల తరబడి రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు, పూలు, టీస్టాల్స్, సైకిల్ షాపు, చెప్పులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. తొలుత వీరందరికి ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. అనంతరం విస్తరణ పేరుతో దుకాణాల సరిహద్దు వరకు రోడ్డును తవ్విన అధికారులు రెండు నెలల తర్వాత పనులు చేపట్టి నిదానంగా చేస్తున్నారు. కాలవ తవడంతో వ్యాపారాలు లేని పరిస్థితి.

**శాఖల మధ్య సమన్వయ లోపం..?**

రెవెన్యూ, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, ఆర్అండ్ బీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కారణంగా పనులు వేగం గా సాగడం లేదనే వాదన ఉంది. సంబంధిత శాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంతో ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహాత్మాగాంధీ, ఎన్టీ ఆర్ కొత్త కాంస్య విగ్రహాలు ఏర్పాటు నిమిత్తం పాత విగ్రహాలను తొలగించేశారు. కొత్త విగ్రహాల ఏర్పాటుకు పాత చోటే ఎమ్మెల్యే యార్లగడ్డ శంకుస్థాపన చేశారు. అయితే దుకాణాలు ఎదుట డ్రెయిన్ కోసం భారీగా గోతులు తవ్విన అధికారులు ఎప్పటికి పూర్తి చేస్తారోనని సందేహాలను సదరు వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరితగతిన విస్తరణ పనులు పూర్తిచేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

**గుప్తా రెసిడెన్సి వైపు కొత్త డ్రైనేజీ లేనట్లే...**

ప్రభుత్వం డ్రైనేజీ నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడంతో గుప్తా రెసిడెన్సీ వైపు కొత్త డ్రైనేజీ నిర్మాణం లేనట్లే అని తెలుస్తుంది. పాత డ్రైనేజీలో పూడికలు తీస్తున్నారు. దానిని యధావిధిగా వదిలేయాలని ఆలోచనలు అధికారులు ఉన్నట్లు తెలిసింది. దీనికి నిధులు లేకపోవడమే అంటున్నారు. ఇటువైపు కొత్త డ్రైనేజీ నిర్మాణం చేయాలంటే 10 నుంచి 15 లక్షల దాకా నిధులు అవసరమని అంటున్నారు. ఆర్.డబ్ల్యూఎస్, మండల పరిషత్, పంచాయతీలో నిధులు లేవని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ దీనిపై స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు రాబడితేనే ఇక్కడ డ్రైనేజీ నిర్మాణం వీలవుతుందని అంటున్నారు. కొత్త డ్రైనేజీ కట్టకుండా రోడ్డు విస్తరణ చేసిన ఉపయోగం ఉండదని అంటున్నారు. మరోవైపు జాతీయ రహదారి కి రెండువైపులా ఉన్న డ్రైనేజీలో పూడికతీతలు సక్రమంగా జరగడం లేదని స్థానికులు అంటున్నారు. ఆగిరిపల్లి రోడ్డు విస్తరణ ఎందుకు చేపట్టారు ఎవరికీ అర్థం కాకుండా తయారైందని స్థానిక వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.


వంకరగా నిర్మిస్తున్న కొత్త డ్రైనేజీ


ఎన్టీఆర్ బొమ్మ వైపు పాత డ్రైనేజీ



## సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో డిజిపి

**ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన హరీష్ కుమార్ గుప్తాకి దేవస్థానం ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. ముందుగా హరీష్ కుమార్ గుప్తా నాగ పుట్టలో పాలు పోసి మొక్కుబడ్లు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా ఆలయ అధికారులు హరీష్ కుమార్ గుప్తా పట్టు వస్త్రాలు తోపాటు శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు, అవనిగడ్డ డీఎస్పీ టి విద్య శ్రీ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




## నాట్య కళాపీఠంలో ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు

**ప్రజాశక్తి-మొవ్వ** : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో మూడు రోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్, డిప్లమోకోర్సుల ప్రాక్టీకల్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. డిప్లమోకోర్స్ పరీక్షలకు 21 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైయ్యారు. పరీక్షలకు అధికారిగా సుధీర్ రావు వ్యవహరించగా కళా పీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాల కష్ణ నట్టువాంగంతో, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి మదంగంపై సహకరించారు.


మృతుని కటుంబసభ్యులను పరామర్శిస్తున్న మండలి వెంకట్రాం

## మృతుని కుటుంబానికి పరామర్శ

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : ఇటీవల పులిగడ్డ గ్రామంలో మరణించిన టిడిపి కార్యకర్త బొర్రా నాగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు, జనసేన సీనియర్ నాయకులు గుడివాక శివరావు పరామర్శించారు. ఆదివారం పులిగడ్డలోని బాధిత కుటుంబం వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తాము అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. వారి వెంట ఓటమి నాయకులు టిడిపి బీసీ నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ఉన్నతికి ప్రసాదరావు విశేష కృషి

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు గ్రామస్తులతో మమేకమై వారి మన్ననలు పొందడం సామాన్యమైన విషయం కాదని మచిలీపట్నం ఎంఈఓ దుర్గాప్రసాద్ కొనియాడారు. ఆదివారం మచిలీపట్నం మండలం లోని అరిసేపల్లి ఎం పి పి ఎస్ పాఠశాల లో సుదీర్ఘ కాలం ఉపాధ్యాయునిగా పని చేసిన జుజ్జవరపు ప్రసాదరావు బదిలీ కావడంతో గ్రామస్తులు సన్మానం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2017 సంవత్సంలోలో బదిలీలో అరిశేపల్లి పాఠశాలకు వచ్చిన ప్రసాదరావు ఆ విద్యా సంవత్సరం ఉన్న ఆరుగురు విద్యార్థులను క్రమంగా పెంచారన్నారు. పాఠశాలలో రెండవ టీచర్ పోస్టు రావడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. మచిలీపట్నం స్థాయిలో యువకెరటాలులో ప్రాథమిక స్థాయిలో డ్రాయింగ్ విభాగంలో కె హేమశ్రీ ద్వితీయ బహుమతి, వై నికితకు నవోదయలో సీటు సంపాదించే విధంగా కృషి చేయటలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. అనంతరం ప్రసాదరావు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 గురు ప్రసాద్,విద్యాకమిటీ చైర్మన్ పి రామాంజనేయులు, విద్యార్దులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెండి నాగపడగ బహూకరణ

**ప్రజాశక్తి మోపిదేవి** : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విజయవాడకు చెందిన ఆదివారం దర్శించుకుని వెండి నాగ పడగ బహుకరించారు. రావి సుబ్బరత్నం స్వామివారికి భక్తితో 250 గ్రాములు బరువు కలిగిన వెండి నాగపడగ, వెండి పళ్లెం ( సుమారుగా 30 వేల రూపాయలు ) స్వామివారికి కానుకగా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకి అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం : కైలే

**ప్రజాశక్తి-పమిడిముక్కల** : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫల మైందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకులు, అమ్మినపురం తదితర గ్రామాల్లోని కార్యకర్తలను కలుసుకుని మాట్లాడారు. రాబోయే కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, తప్పక పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడతారని తెలిపారు. పమిడిముక్కలు మండలంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై కార్యకర్తలతో పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ, మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, మాజీ ఎంపీపీ సొంటి వెంకటేశ్వరావు, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కైలే అనిల్కుమార్

## ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరంతర పోరాటం

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)** : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం పోరాడే సంఘం యుటిఎఫ్ లో సభ్యులుగా చేరాలని యుటిఎఫ్ నాయకులు సూచించారు. ఆదివారం యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఏ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి సౌకత్ హుస్సేన్ బి కనకారావు లు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి దిక్సూచిగా వ్యవహరిస్తున్న యుటిఎఫ్ను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.గత సంవత్సరాల్లో యూటీఎఫ్ ని ఆదరించిన ఉపాధ్యాయు లందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తు న్నామన్నారు. అలాగే ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉపాధ్యాయులు యుటిఎఫ్ సభ్యులుగా చేరాలని ఉపాధ్యాయ సమస్యల పట్ల సాధనలో ముందు నిలబడాలన్నారు. ఈ కార్యక్ర మంలో సహధ్యక్షులు ఎన్ ప్రభాకర్ రావు, జై ఝూన్సీ కోశాధికారి మరీదు వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

## పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**విజయవాడ :** 58 డివిజన్ సైకిల్ షాప్ వత్తి చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్న శివ అనే చిరు వృత్తిదారుడు. పూలవ్యాపారి పిల్లలకు భరద్వాజ్ పేరుమీద దాత సహకారంతో ఆదివారం విద్యాసామాగ్రి అందజేశారు. డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు యు.శివలింగేశ్వరరావు, ఎస్.కె నిజాముద్దీన్ నాయకులు ఎన్ దుర్గాప్రసాద్ మాకినేని బసవ పున్నయ్య భవన్లో పుస్తకాలు బ్యాగు అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ యువజన సంఘంగా మెడికల్ క్యాంపులు బ్లడ్ డోనర్ గ్రూపులు నడుపుతూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగానే నిరుపేదలకు పుస్తకాలు నోట్స్ లు బ్యాగులు పంపిణీ చేస్తూ ఉన్నామని తెలిపారు. ఎంబిపి స్టేడియం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కొరకు అనేక సంవత్సరాల నుంచి పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు శివలింగేశ్వరరావు.. ఉపాధ్యక్షుడు ఎం నాగ దుర్గాప్రసాద్. నాయకులు ఫారుక్ పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలివ్వాలి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ రీజినల్ కార్యాలయంలో ఎపి జెన్ కోలో పని చేస్తున్న వివిధ స్టేషన్‌ల కాంట్రాక్ట్ కార్మికుల (ఔట్ సోర్సింగ్) సమస్యలపై ఆలపాటి శివ నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలుగునాడు రాష్ట్ర అధ్యక్షులు పర్వతనేని సాంబశివరావు, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు కేతు మధు సూధన రెడ్డి, పివివి సత్యనారాయణ, జి.కృష్ణ మోహన్, ఈ సుబ్బారావు హాజరయ్యారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పర్మనెంట్ ఉద్యోగాలు కల్పించాలని, లేకపోతే డైరెక్టు పేమెంట్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గానికి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. 2022 సవరణకు సంబంధించి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి కేటగిరి మార్పు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఎన్‌టిటిపిఎస్, డాక్టర్ ఎంవిఆర్‌ఆర్‌టిపిపి నెల్లూరులో పనిచేస్తున్న పీస్ వర్కర్లను పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికులకు గుర్తించాలి. కార్మికుల పిల్లలకు డిఎవి స్కూల్‌లో ఉచిత విద్యనందించాలి అని వినతిపత్రం పేర్కొనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జెన్కోలోని వివిధ థర్మల్, హైడెల్ స్టేషన్ నుండి కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** లైయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట 2025 – 26 నూతన కార్యవర్గం ఎన్నికల అధికారి, జోన్ చైర్మన్ లయన్ రాజా కేశవ్ ప్రసాద్ ఆధ్వర్యంలో లైయన్స్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో నూతన అధ్యక్షులుగా లయన్ శ్రీరామ్ బద్రి నారాయణ, కార్యదర్శిగా లయన్ షేక్ ఖాసిం సైదా, కోశాధికారిగా లయన్ బండారు రవికుమార్, మొదటి, రెండో ఉపాధ్యక్షులుగా లయన్ కరుణాకర్, లయన్ మహేష్ మెంబర్షిప్ చైర్మన్‌గా లయన్ మోహన్ బాబు, క్లబ్ కో ఆర్డినేటర్‌గా లైన్ మేజర్ సత్యనారాయణ, సర్వీస్ చైర్మన్‌గా లయన్ పసుపులేటి ప్రసాద్, కమ్యూనికేషన్ చైర్మన్‌గా లయన్ నారాయణరెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా లయన్ డాక్టర్ రాజా కేశవ ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ కార్యదర్శి లయన్ షేక్ ఖాసిం సైదా తెలిపారు.

## 'మానవత' నూతన కమిటీ ప్రమాణస్వీకారం

**విజయవాడ :** స్వచ్ఛంద సేవా సంస్థ 'మానవత' నగర సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక జిల్లా సీనియర్ సిటిజన్స్ హాల్‌లో జరిగింది. 2025– 26 కు అధ్యక్షులుగా న్యాయవాది పగిడిపల్లి రాము కార్యదర్శిగా దావులూరి సాంబశివరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ చేత మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో బుడమేరు వరదల వల్ల నష్టపోయిన పేద విధ్యర్థి చదువు నిమిత్తం 5 వేలు, అనారోగ్యంతో మంచాన పడ్డ కుటుంబానికి 5 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ వరదలు కూడా లెక్క చేయకుండా ముంపు ప్రాంతాల్లో సేవలు అందించడం గర్వకారణం అన్నారు. అవసరం ఉన్నచోట సమాజ సేవ చేయాలని అన్నారు. కార్యవర్గ సభ్యులుగా రంగు వెంకట సుబ్బారావు, మొవ్వ శైలజ, నందిగం రఘునాథ్, భూపతి రాజు సత్యనారాయణ, కుమారబాబు ఉన్నారు. సమావేశంలో కె.రామ మోహన్, పొట్లూరి వీర శేషగిరిరావు, దండమూడి జయలక్ష్మి పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలి



మాట్లాడుతున్న కాశీనాథ్

**ప్రజాశక్తి - విజయవాడ :** అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న జీఓ నెంబర్ 107 ప్రకారం ఆస్తులున్న ప్రతి ఒక్కరినీ నమోదు చేసుకొని ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. కృష్ణలంక 22వ డివిజన్ సిపిఎం ఆధ్వర్యంలో మానుకొండ భవన్‌లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ లబ్దిదారుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి నాయకులు వాజా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశానుద్దేశించి కాశీనాథ్ మాట్లాడుతూ సిపిఎం, ఇతర ప్రజాసంఘాలు చేసిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా జీఓ నెంబర్ 107 సాధించుకున్నట్లు తెలిపారు. ఈ జీఓ ఆధారంగా ఆస్తి ఉన్న ప్రతి ఒక్కరినీ సంబంధిత విఆర్ఓ నమోదు చేసుకొని పట్టా రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని, లేనట్లయితే లబ్దిదారులను కలుపుకొని ఆందోళన చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. 22వ డివిజన్ పరిధిలో కమర్షియల్ (వ్యాపార) గా ఉన్న గృహాలను ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవడం లేదని డివిజన్‌లోని విఆర్ఓ స్థాయి ఉద్యోగులు చెప్పడం సరికాదన్నారు. నిబంధనలు సడలించి ఎటువంటి ఆస్తి కల్గి ఉన్నప్పటికీ ప్రతి ఒక్క లబ్దిదారుడి పేరు మీద ఇళ్ల పట్టారిజిస్ట్రేషన్ చేసే సదుపాయం కల్పించాలని కోరారు. లేనట్లయితే స్థానిక ప్రజలు, సదరు లబ్దిదారులను కలుపుకొని జిల్లా కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు, ఆ తరువాత వివిధ దశల్లో ఆందోళనలు చేయాల్సి వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి పి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, నాయకులు కాయల కుమారి, లక్ష్మణరావు, టి తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వస్త్రాలు, మందులు పంపిణీ

**ప్రజాశక్తి - విజయవాడసిటీ :** భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా ప్రజలకు కల్పించిన హక్కుల రక్షణ బాధ్యతలను సంరక్షించడమే తమ ప్రధాన కర్తవ్యం అని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ భుజంగ నాయక్ వెల్లడించారు. ఆదివారం భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ చీఫ్ సెక్రటరీ సిహెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భవానీపురంలోని శ్రీ వెంకట సాయి శ్రీ వృద్ధాశ్రమ సేవా సంఘ నిర్వాహకులు, వృద్ధులకు వస్త్రాలు, నెలవారి మందులు అందజేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ఎం.పవన్ కళ్యాణ్, నేషనల్ డైరెక్టర్ డాక్టర్ భుజంగ నాయక్ మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణతో పాటు మానవసేవయే మాధవ సేవగా భావిస్తూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే భవానీపురం వృద్ధాశ్రమ వృద్ధులకు ఆహారం,



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పండ్లు, నెలవారి మందులు, వస్త్రాలు అందించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నూతనంగా నియమితులైన పలువురికి భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరపున నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ ప్రెసిడెంట్ మనోహర్, స్టేట్ లీగల్ సెల్ ప్రతినిధి వి.గోపికాంత్, ఉమెన్స్ వింగ్ ప్రతినిధి చల్లపల్లి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై గొడ్డలితో దాడి

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ శివారు బూరుగగూడెం గ్రామంలో శనివారం సాయంత్రం మట్టకొయ్య శ్రీను(55) అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. ఇంటి సరిహద్దు విషయంలో కొవ్వూరి మనోజ్ (24)కు మట్టకొయ్య శ్రీనుకు మధ్య గొడవ జరిగింది. ఇరువైపులా మాటలతో గొడవ ముదిరి కొవ్వూరి మనోజ్ గొడ్డలితో మట్టకొయ్య శ్రీనును తలపై బలంగా నరకడంతో శ్రీను ఒక్కసారిగా స్పృహతప్పి కుప్పకూలిపోయాడు. శ్రీనును రెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా స్థానిక వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. అనంతరం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శ్రీను తలను పరిశీలించి మరింత మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన విషయమై పోలీసు వారి నుంచి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# 9న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** భవన నిర్మాణరంగ కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడ్డ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, దారి మళ్ళిన నిధులను తిరిగి జమ చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పిల్లి నరసింహారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సిఐటియు అనుబంధ సంస్థ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ పశ్చిమ నగర శాఖ నాలుగో మహాసభ కొత్తపేటలోని మోటూరు హనుమంతరావు భవన్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసి అమరులైన జెఎం.కొండారెడ్డి, కె.మస్తానావు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పిల్లి నరసింహారావు, సిపిఎం పశ్చిమ నగర శాఖ కార్యదర్శి బోయి సత్య బాబు మహాసభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పశ్చిమ నగర శాఖ 25 మందితో కూడిన నూతన కమిటీ ఏర్పాటు జరిగిందన్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా సుధాకర్ రెడ్డి, కార్యదర్శి కె.శంకరయ్య, కోశాధికారి వెలుగొండ రెడ్డితో కూడిన నూతన కమిటీ ఏర్పడినట్లు తెలిపారు. **వత్సవాయి :** ఏపీ రైతు సంఘాల



విజయవాడలో మాట్లాడుతున్న నరసింహారావు

సమన్వయ సమితి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న జగనున్న జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేట్ అగ్రిమెంటు తిరస్కరించాలని తద్వారా విదేశీ యంత్రాంగాన్ని రక్షణ ఇప్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **ఇబ్రహీంపట్నం :** జులై 9న సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం కామ్రేడ్ వెలగా లక్ష్మణరావు భవన్‌లో ఈ జరిగిన సిఐటియు విస్తృత సమావేశం సందర్భంగా జూలై 9న జరిగే సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు.

## జాతీయ సదస్సుకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** జూలై 3, 4 తేదీల్లో హర్యానాలోని గురుగ్రామ్‌లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్‌లకు 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అంశంపై అవగాహన కల్పించడం కోసం రెండు రోజులు జాతీయ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు ఏపీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు అవకాశం దక్కింది. వీరందరికీ నోడల్ ఆఫీసర్‌గా రాజమండ్రి మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ నాగ నరసింహా రావు వ్యవహరించనున్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి-విజయవాడ :** పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీసు స్టేషన్ల , టాస్క్ ఫోర్స్ కార్యాలయంలలో అయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిదిలోని రౌడీషీ టర్‌లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జాబ్ మేళా

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) సహకారంతో ఏపీ స్కిల్ డెవెలప్మెంట్ నిర్వహణతో జేఆర్సి విద్యా సంస్థల సారథ్యంలో నడపబడుచున్న లైఫ్‌స్కిల్స్ వొకేషనల్ జూనియర్ కాలేజీకి అనుబంధంగా అమ్మాణి డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ తరపున నిర్వహించిన జాబ్ మేళాకి 300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేళాలో 14 కంపెనీల హెచ్.ఆర్.ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలో పాల్గొన్న సుమారు 150 మంది అభ్యర్థులను ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఆర్‌సి విద్యాసంస్థల సెక్రటరీ కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్, డైరెక్టర్ రంగాపురం నాగేశ్వరరావు, లైఫ్ స్కిల్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సి టి వెంకటేశ్వర రాజు, జేఆర్సి కాలేజీ ప్రిన్సిపాల్ అబ్బులు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రామ తులసి, స్కిల్ హబ్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి - గంపలగూడెం :** పూర్వంలా ఖరీదు లేని చదువులు కావాలని పలువురు పూర్వ విద్యార్థులు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986–87 పదో తరగతి విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాటి కాలంలో రూపాయి ఖర్చు లేకుండా చదువుకునేవారని, నేడు అది పేదోడికి అందని ద్రాక్షగా దానిని కొనుగోలు చేయాలంటే ఆస్తుల అమ్మినా సరిపోవడంలేదని ఆవేదన చెందారు. చదువుకునే రోజులు మారి చదువుకొనే పరిస్థితులు రావడంతో ఎందరో విద్యార్థులు వీధిన పడాల్సి వచ్చింది అన్నారు. ప్రభుత్వం పునర్ పరిశీలన చేసి భవిష్యత్తులో పూర్వకాలం నాటి ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించాలన్నారు. కార్పొరేట్ విద్య వచ్చిన తర్వాత సామాన్యుడికి చదువు దూరమైందని, ఒక దశలో కంటతడి పెట్టారు. అనంతరం పూర్వ గురువులను సత్కరించారు.

# కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి మేలు : షర్మిల



పట్టాభి స్మారక భవన నిర్మాణంపై షర్మిలకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆదివారం ఆమె కృష్ణాజిల్లా మచిలీపట్నం పర్యటనలో భాగంగా స్థానిక పట్టాభి భవనంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, వైసీపీలు స్వార్థ రాజకీయాల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని బీజేపీతో ప్రజల కోసం పోరాడుతోందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రాష్ట్ర విభజన హామీలు నెరవేరతాయని ఆమె తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ, నియోజకవర్గ ఇంచార్జులు అబ్దుల్ మతీన్, మొవ్వ మోహనరావు, శొంఠినాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

**పట్టాభి స్మారక భవన నిర్మాణానికి కృషి చేయాలని వినతి**

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పట్టాభి స్మారక భవన నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డికి సంఘ సేవకుడు పి ఎస్ ఎస్ ఆర్ శర్మ ఆదివారం వినతిపత్రం సమర్పించారు. స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకుడు, స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట మచిలీపట్నంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించే కన్వెన్షన్ హాల్, మ్యూజియం లైబ్రరీ నిర్మాణమునకు మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదం తెలపకుండా పలువురు అడ్డుపడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ తరపున స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట నిర్మించే స్మారక భవన నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, అబ్దుల్ మతీన్ పాల్గొన్నారు.

**త్వరలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం : శొంఠి**

పెడన నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా బంటుమిల్లి, పెడన గ్రామాల్లో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. పెడన నియోజకవర్గ ఇంచార్జ్ ,రాష్ట్ర ఓబిసి అధ్యక్షులు శొంఠి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో గ్రామ ,మండల, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు ,మహిళలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శొంఠి నాగరాజు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలను ప్రశ్నించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని నాగరాజు అన్నారు.ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి షర్మిల కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలలో షర్మిల నాయకత్వం లో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో ఘన విజయం సాధిస్తుందని నాగరాజు జోష్యం చెప్పారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న గొట్టిపాటి రామకృష్ణప్రసాద్

## యోగా జీవితంలో భాగం కావాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : యోగాను జీవితంలో భాగంగా చేసుకుని మానసిక ప్రశాంతత, ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. సాత్విక్ యోగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 రోజులు 50 ఆసనాలు శిక్షణ పొందిన వారికి మండలంలోని గండిగుంటలో గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ఆవరణలో ఆదివారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50 రోజుల పాటు 50 ఆసనాలు నేర్పించి వారి సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడిన సాత్విక్ యోగా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత మనకే దక్కుతుందని, ప్రపంచ యోగా దినోత్సవము పుర స్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించి యోగాంధ్ర ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం గర్వకారణ మన్నారు. అసోసియేషన్ అధ్యక్షురాలు అనంతనేని రాధిక, భారత స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దామర్ల దుర్గారావు, సాత్విక్ యోగా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చిందా కుటుంబరాజు, సెక్రటరీ జంపాన శ్రీనివాసగౌడ్, ముక్తిపథం జ్ఞాన యజ్ఞ యోగాశ్రమ స్థాపకుడు ఎన్. శ్రీనివాసరావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ ముదిగొండ నాగ వీరభద్రశాస్త్రి, యోగాచార్య దావులూరి రాధాకష్ణ మూర్తి, గరికపాటి వెంకట సుబ్బారావు, నూకల సాంబశివరావు, యోగా శిక్షకుడు జి.కష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యోగా శిక్షకుడు జి.కష్ణను ఘనంగా సత్కరించారు.



## నేటి నిరసనను జయప్రదం చేయండి : వైసిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వ ద్వంద వైఖరి వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమం, కలెక్టర్కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైఎస్ఆర్సిపి పంచాయతీరాజ్ శాఖ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వైఎస్ఆర్సిపి కార్యాలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి పార్టీకి సంబంధించిన సర్పంచులు ఎంపిటీసీలు జడ్పిటిసిలు అధికంగా ఉండటంతో వారికి ఇవ్వవలసిన గౌరవ వేతనాలను చెల్లించకుండా రక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ పథకం లో జరిగే అవినీతిపై విచారణ చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ చట్టం మేరకు గ్రామపంచాయతీల ద్వారానే పనులు జరిపించి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, సర్పంచులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింప చేయాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు 1150 కోట్లు స్థానిక సంస్థలకు జమ చేయాలని, సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి ఎంపిపి లకు గౌరవ వేతనాలను పెంచాలని తదితర డిమాండ్లతో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు చింతలపూడి బాలు, గరికపాటి వెంకట కష్ణారావు, సింహాద్రి రామచంద్రరావు పాల్గొన్నారు.

## 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వ రరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి. ఉమామహేశ్వ రరావు అన్నారు. ఆదివారం ఉయ్యూరులోని శ్రామిక భవనం లో ఏర్పాటు చేసిన జిల్లా సిఐటియు విస్తృత సమావేశం లో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పెద్ద ఎత్తున ర్యాలీ ప్రదర్శనల్లో పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు సాధించు కున్న 44 చట్టాలను సవరించి ఫ్యాక్టరీ పెట్టుబడుదారులకు అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చిందని ఆయన ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. కార్మిక వర్గానికి కనీస వేతనాలు 26,000 చెల్లించాలని చెప్పారు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని పరిరక్షించాలని ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అన్నారు. సివిల్ సప్లై పెద్ద ముఠా వంటి హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునః ప్రారంభం చేసి సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. స్కీం వర్కర్స్ అంగన్వాడి ఆశ వంటి శ్రామిక మహిళ సమస్యలు పరిష్కారం చేయాలని చెప్పారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు ప్రతినెల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కార్మికులకు 300 రోజులు పని దినాలు కల్పించాలి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు జిల్లా జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావుఅధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు కష్ణా జిల్లాప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు జిల్లా ఉపాధ్యక్షులు వై. నరసింహారావు కమిటీ సభ్యులు బి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి పామర్రు అధ్యక్షుని ఎన్నిక

ప్రజాశక్తి - పామర్రు : పామర్రు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులుగా కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఈడే నానీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కోటా వీరబాబు,మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పుష్పవతి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక ఏకగ్రీవం అయింది. పామర్రు మండల కమిటీఎన్నికల నిర్వాహకుడిగా దేవినేని రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీ దాస్,మాజీ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ మండపాక శంకర్ బాబు, పంచాయతీ సభ్యుడు మంతెన రామాంజనేయులు, మాజీ పంచాయతీ ఉప సర్పంచ్ కోటి పాండు, సీనియర్ నాయకుడు ఈడే ఘంటేశ్వరరావు,పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి చాట్ల పెద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రవీణ్,నానీలకు ఎమ్మెల్యే వర్ల అభినందనలు:** పామర్రు మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఈడే నానీలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తన కార్యాలయంలో అభినందించారు. పార్టీలో నిబద్ధత కలిగి పనిచేసినందువల్ల తగిన గుర్తింపు లభించిందని అన్నారు.రామలక్ష్మణుల వలె ఐక్యమత్యంతో పార్టీని ముందుకు నడిపించే సామర్థ్యం వీరికుందని తన వంతు సహకారం కూడా అందిస్తానని ఆయన అన్నారు.



మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వర్ల

# గుండె వైద్యంలో కొత్త శకం

- ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సదస్సు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రమేష్ హాస్పిటల్స్ 37వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, దక్షిణ భారతదేశంలోని ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు – ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యుల ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం ఆదివారం నగరంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్స, నివారణలో ఆధునిక పద్ధతులపై చర్చలు జరిగాయి, పలువురు ప్రముఖ వైద్యులు తమ అనుభవాలను, ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. తొలుత రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు ఈ నిరంతర వైద్య విద్యా కార్యక్రమం లో కీలక ఉపన్యాసాన్ని ఇచ్చారు. కష్ణా, ఎన్.టి.ఆర్., గుంటూరు, ప్రకాశం, ఏలూరు, మరియు పశ్చిమ గోదావరి జిల్లాల నుండి హాజరైన 1,300 మందికి పైగా వైద్య నిపుణులను ఉద్దేశించి, గుండె వైద్య రంగంలో ఇటీవలి విప్లవాత్మక మార్పులను వివరించారు. డాక్టర్ రమేష్ బాబు తమ ఉపన్యాసంలో, గుండె రక్తనాళాల్లో పూడికలను (ప్లాక్) సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో సిటీ కరోనరీ యాంజియోగ్రామ్ ద్వారా గుర్తించే విధానం తెలియ చేశారు. 2021 నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక నిర్ధయాత్మక పరీక్షగా పరిగణించబడుతోందని తెలిపారు. దీని వల్ల క్యాత్ యాంజియోగ్రామ్ రెండవ నిర్ధయాత్మక పరీక్షగా మారిందని, దాదాపు 80 శాతం కేసుల్లో క్యాత్ యాంజియోగ్రామ్ అవసరం తగ్గిందని వివరించారు. అదేవిధంగా, ఏఐ-ఆధారిత సీటీ ఎఫ్ఎఫ్ఆర్ పరీక్షను ప్రస్తుతం గోల్డ్ స్టాండర్డ్‌గా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. రమేష్ హాస్పిటల్స్‌లో నిర్వహించిన 26,000 సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ పరీక్షలను అల్గారిథం ఆధారంగా క్రోడీకరించి, వ్యాధి నిర్ధారణ , చికిత్స సిఫార్సులలో గణనీయమైన పురోగతిని సాధించినట్లు తెలిపారు. డాక్టర్.జయరాం పాయ్ డాక్టర్.శివ ప్రసాద్ సారధ్యంలోని గుండె శస్త్ర చికిత్సల వైద్య బందం ఈ సీ.ఎం.ఈ లో నిరంతరం చేసే బైపాస్ సర్జరీ ల గురించి తెలియచేశారు .డాక్టర్ ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ , ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ పి. చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

## సబ్ జూనియర్స్ అండర్-15 చదరంగం విజేతలు

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :**

నగరంలోని ఫన్ టైమ్స్ నందు ఆదివార అండర్ 15 సబ్ జూనియర్స్ చదరంగం పోటీలు నువ్వా నేనా అనేలా రసవత్తరంగా ఈ పోటీలు సాగాయి. ఈ పోటీలకు ఫన్ టైమ్స్ కార్యవర్గ సభ్యులు బుర్ర రాధాకృష్ణ వైస్ ప్రెసిడెంట్, కొసరాజు విజయబాబు ఆర్గనైజర్ సెక్రెటరీ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదరంగం ప్రతిరోజు సాధన చేసే వారికి జీవితంలో అనేక విజయాలతో ముందుకు సాగుతారని అన్నారు. ఈ ఆట వలన పిల్లలకు జ్ఞాపకశక్తి అన్ని విషయాలను చురుగ్గా ఉంటారని తెలిపారు **విజేతలు :** బాలురు విభాగంలో తాళ్ల నిశ్చల్ 6/7 పాయింట్లతో ప్రథమ, ఎన్ ప్రీతం దర్శన్ 6/7 పాయింట్లతో ద్వితీయ, అనగానే శశాంక్ 6/7 తతీయ, మందుల బాబు శామ్యూల్ 6/7 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో జే నందిక 5/5 ప్రథమ, పి గీతిక 4/5 ద్వితీయ, శ్రీమహి 4/5పాయింట్లతో తతీయ, కె సాయి వీక్షణ 4/5 నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ గెలుపొందిన క్రీడాకారులు జులై 12వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు మన ఎన్టీఆర్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి అక్బర్ పాషా మరియు మందుల రాజీవ్ తెలిపారు.

## ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ :**

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ (10) చైల్డ్ , అండర్ (12) మిని విభాగంలో ఫెన్సింగ్ ఛాంపియన్షిప్‌నకు 10 జిల్లాల నుండి 200 మంది క్రీడాకారులు ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లు పోటీలలో పాల్గొననున్నారు.ఈ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టిడిపి యువ నాయకులు, ప్రముఖ న్యాయవాది బొండా రవితేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫెన్సింగ్ అనేది ఒక ఒలింపిక్ క్రీడ “ఆధునిక ఖడ్గయుద్ధం” క్రీడలో, ఇద్దరు ప్రత్యర్థులు (ఫెన్సర్లు) ఒకరినొకరు కత్తితో తాకడానికి ప్రయత్నిస్తారు, అదే సమయంలో తమను తాము దాడుల నుండి రక్షించుకుంటారు అని, ఇది చాలా వేగవంతమైన, వ్యూహాత్మక , శారీరక సామర్థ్యం అవసరమయ్యే క్రీడ అని అన్నారు.భారతదేశంలో ఫెన్సింగ్ క్రీడ క్రమంగా ప్రాచుర్యం పొందుతోందని అన్నారు. భారత ఫెన్సర్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు., 2025 ప్రపంచ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లు జూలై 22 నుండి 30 వరకు జరుగనున్నాయని అన్నారు. పిల్లలు ఈ క్రీడలో జాగ్రత్తలు వహించి టోర్నమెంటు లో గెలుపొంది మంచి పథకాలు తీసుకొని రావాలని పిల్లలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులు చెంచు బాబు, నాగం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి విస్తృతంగా సూర్యఘర్

### విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు - ఫేజ్ వైడ్‌గా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు

**ప్రజాశక్తి - విజయవాడ :** ప్రధానమంత్రి (పి.ఎం) సూర్యఘర్ స్కీమ్ ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేయడమే లక్ష్యంగా వీలయినన్నీ ఎక్కువ సర్వీసుల్విడంపైనే (కనెక్షన్లు) దృష్టి కేంద్రీకరించడం జరుగుతుందని విద్యుత్‌శాఖ విజయవాడ సర్కిల్ ఎస్.ఇ టి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిబంధనలు పరిగణలోకి తీసుకొని పిఎం సూర్యఘర్ పథకం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నిత్యావసర సరుకుగా తయారయిన విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా, దాని కొరత నుంచి బయటపడేందుకు, ఆ రంగంలో ఎదురు కాబోతున్న సమస్యలను అధిగమించేందుకు సూర్యఘర్ (విద్యుత్) ప్రాధాన్యత, దాని ఉత్పత్తి, విస్తృత స్థాయిలో దాని వినియోగం, ఆదిశగా పెంచాల్సిన కనెక్షన్లు, రానున్న కాలంలో విద్యుత్ శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికా బద్ధమైన పని విధానం ఉంటుందని ఎస్.ఇ వివరించారు. విద్యుత్ అంతరాయాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సిఎం సూర్యఘర్ పథకం దానిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత తదితర అంశాలపై ఎస్ఇ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

**ప్రశ్న: విజయవాడ సర్కిల్ పరిధిలో విద్యుత్ అంతరాయం తరచూ ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలు?**

**జవాబు:** ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులు, వీధురు గాలులు, చెట్లు విరిగిపడటం, విద్యుత్ స్తంభాలు ఒరిగి, లైన్లు కూడా దెబ్బతింటున్న తరుణంలో ఎక్కడా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా ఆయా

**ఎలక్ట్రికల్ ఎస్ఇ శ్రీనివాసరావు**



సబ్ డివిజన్ల పరిధిలో విద్యుత్ అధి కారులు, ఉద్యోగులు ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నాం. అక్కడి కక్కడే మరమ్మతు పనులు చేయి స్తున్నాం. విరిగి పోయిన చెట్లను తొలగిం చడం, ఒరిగి పోయిన విద్యుత్ స్తంభాలను యధాస్థానంలోకి తీసుకురావడం, విరిగిపోయిన వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు, దెబ్బతిన్న లైన్లను బాగు చేయించి, విద్యుత్‌ను పునరుద్ధరించడం చేస్తున్నాం.

**ప్రశ్న: విద్యుత్ బకాయిలు, వాటి రాబడిపై ఏమేరకు దృష్టి సారిస్తున్నారు?**

**జవాబు :** విద్యుత్ బకాయిలను రాబట్టడానికి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. ముఖ్యంగా పంచాయతీల నుంచి విద్యుత్‌శాఖకు రావాల్సిన బకాయిలను ఇటీవల కాలంలో కొంత వరకు విడుదల చేశాం. పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర సంస్థల నుంచి రావాల్సిన బకాయిలపై కూడా ప్రత్యేక కేంద్రీకరించాం.

**ప్రశ్న: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ఏ మేరకు జరుగుతుందో వివరించగలరు?**

**జవాబు :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి స్మార్ట్ మీటర్లను ఫేజ్ వారీగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇప్పటికే పరిశ్రమలు, కమర్షియల్/ వ్యాపార సముదాయాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్‌ను అమర్చడం జరుగుతుంది.




అయితే క్షేత్రస్థాయి పరిస్తితులను దృష్టిలో ఉంచుకొని స్మార్ట్‌మీటర్లను ఇళ్లకు బిగిస్తున్నాం.

**ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లాకు సూర్యఘర్ కనెక్షన్ల టార్గెట్ ఎంత?**

**జవాబు :** ఈ నెలలో మంజూరు చేయాల్సిన 23,670 కనెక్షన్లు రాష్ట్ర వ్యాప్త టార్గెట్ కాగా, ఇప్పటి వరకు ఎన్‌టిఆర్ జిల్లాలో 2,065 కనెక్షన్లు ఇచ్చాం. అయితే వీటికి సంబంధించి కనెక్షన్లు పొందడానికి సబ్సిడీ లోను సదుపాయం కోసం అప్లై చేసుకున్న (వెండర్స్) వారికి సంబంధించి 14 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న: సూర్యఘర్ స్కీమ్‌లో భాగంగా ప్రతి కనెక్షన్‌దారుడికి లభించే సబ్సిడీ సొమ్ము ఎంత ఉంటుంది?**

**జవాబు:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కొక్క కిలో వాట్‌కయ్యే వ్యయంలో రూ.30 వేలు సబ్సిడీ మంజూరుఅవుతుంది. మొదటి కిలో వాట్‌కు రూ. 30 వేలు, రెండవ కిలో వాట్‌కు మరో రూ. 30 వేలు, మూడవ కిలో వాట్‌కు రూ. 18 వేలు చొప్పున బ్యాంక్ నుంచి సబ్సిడీ సొమ్ము మంజూరుఅవుతుంది. ఒక్కొక్క కిలో వాట్‌కు రూ. 65 వేలు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చులో సగం సబ్సిడీ రూపంలో మంజూరు అవుతుంది.

**ప్రశ్న: ఒక కిలో వాట్ ఎన్ని యూనిట్లకు సమానం?**

జవాబు: ఒక కిలో వాట్ 120 యూనిట్ల విద్యుత్‌కు సమానం.

## విన్ ఫాస్ట్ విద్యుత్ వాహనాల ప్రదర్శన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

నగరంలోని పి వి పి మాల్ నందు విన్ ఫాస్ట్ ఎలెక్ట్రిక్ కార్ల ప్రదర్శన ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విన్ ఫాస్ట్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఫామ్ శాన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో పర్యావరణాన్ని కాపాడాలని ఉద్దేశంతో ఎలెక్ట్రిక్ వాహనాల్ని వినియోగిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే వినియోగదారుల అభిప్రాయానికి అనుగుణంగా విద్యుత్ కార్లను మార్కెట్ లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ వాహనాల్ని అందరికీ తెలియచేయడం కోసం నగరాలు, షాపింగ్ మాల్స్ వంటి ప్రాంతాలలో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.